క్లుప్తంగా

ప్రతి విద్యార్థి గొప్ప శాస్త్రవేత్తగా ఎదగాలి



వెంటూరులో చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

రాయవరం: ప్రతి విద్యార్థి గొప్ప శాస్త్రవేత్తగా ఎదగాలని, విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివితే ఇది సాధ్యమవుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండలంలోని వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశ శాస్త్రవేత్తలు సాధించిన ప్రగతిని హెచ్ఎం డి.సత్తిరాజు, ఉపాధ్యాయులు వివరించారు. అంతరిక్షంలో భారతదేశ ఘనతను విద్యార్థులకు వివరించడం కోసం సైన్స్ ఉపాధ్యాయుడు పి.హరిసూర్యనారాయణ ఆధ్వర్యంలో చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విద్యార్థులు రాకెట్, ఉపగ్రహ నమూనాలను తయారు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శేషుబాబు, బాలకృష్ణ, వి.శ్రీనివాస్, రాజేశ్వరరావు, కె.రమాదేవి, ఉష, సుజాత, వరలక్ష్మి పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అభ్యసించాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నాగరాజు

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మెరుగైన విద్యను నేర్చుకోవాలని ఎంఈఓ ఎ.నాగరాజు అన్నారు. కె.గంగవరం గ్రామ పరిధిలోని రావిదొడ్డిపేటలోని ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈఓ నాగరాజు ఆకస్మికంగా పరిశీలించారు. తొలుత పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు ప్రోత్సాహకాలను అందిస్తున్నారని ప్రభుత్వం కూడా పుస్తకాలతో పాటు ఆర్థిక సాయం అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కోరారు. విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుని విద్యలో రాణించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

కార్యకర్తల కృషితోనే పార్టీలు బలోపేతం

కాజులూరు: కార్యకర్తల కృషితోనే పార్టీలు బలోపేతమౌతాయని బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ దూడల శంకరనారాయణ అన్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో పార్టీ అధ్యక్షుడు మాధవ్ అధ్యక్షతన ఈనెల 25న జరగనున్న ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం దుగ్గుదుర్రులో మండల గ్రామాలకు చెందిన 163 పోలింగ్ బూత్ కన్వీనర్లతో శంకరనారాయణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ 'సారథ్యం' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేస్తూ సోమవారం అమలాపురం రానున్నారన్నారు. ఆయనకు స్వాగతం పలుకుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉదయం 10 గంటలకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దుగ్గుదుర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు యాళ్ళ తనిబాబు, పోలింగ్ బూత్ కన్వీనర్లు సింగన శ్రీనివాసు, నందూరి కామేశ్వరరావు, పాట్నీడి సత్తిబాబు, పంపన రాంబాబు, దూనబోయిన శ్రీనివాసు, అడపా శ్రీనివాసు పాల్గొన్నారు.

శాంతిస్తున్నది

- ఊపిరి పీల్చుకున్న ముంపు గ్రామాలు
- అడుగుమేర తగ్గిన గోదావరి



కోటిపల్లి రేవులో ఫెర్రీ వద్ద అడుగు మేర తగ్గి ప్రవహిస్తున్న వరద

కె.గంగవరం: ఉగ్రరూపం దాల్చిన గోదావరి శనివారం ఉదయం నుంచి తగ్గుముఖం పట్టింది. శుక్రవారం పోలిస్తే అడుగున్నర మేర వరద ఉధృతి తగ్గిందని రెవెన్యు సిబ్బంది తెలిపారు. వరద ఉధృతి తగ్గుతుండడంతో గోదావరి పరివాహక ప్రజలు, ముంపు గ్రామ ప్రజలు కొంత వరకు ఉపశమనం పొందారు. కోటిపల్లి రేవులోని ఫెర్రీ వద్ద పుష్కర ఘాట్‌ల చివరి వరకు ప్రస్తుతం వరద ప్రవహిస్తుంది. మత్స్యకార కాలనీలోని గట్టు ఒడ్డున ఉన్న ఇళ్లు జలదిగ్బంధంలోనే ఉండిపోయాయి. గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండడంతో శనివారం కూడా పంటు ప్రయాణాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు నిలిపివేశారు. పూర్తి స్థాయిలో వరద తగ్గిన తరువాతే పంటు ప్రయాణానికి అనుమతిస్తామని వారు తెలిపారు. ముక్తేశ్వరం రేవు వద్ద గోదావరి పాయలో ఏర్పాటు చేసిన తూరలు ఎన్నడూ లేని విధంగా వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. దీంతో పాటు సుమారు అర కిలోమీటరు మేర తాత్కాలికంగా ఏర్పాటు చేసి కంకర రోడ్డు కూడా వరద ఉధృతికి కొట్టుకుపోయింది.

కొనసాగుతున్న గస్తీ..

కోటిపల్లి రేవుతో పాటు మత్స్యకార కాలనీ, మసకపల్లి నుంచి కూళ్ల వద్ద వరకు ఉన్న ఏటిగట్టుపై పోలీసులు, రెవెన్యూ గస్తీ కొనసాగుతుంది. అనుమతి లేకుండా గోదావరిలోకి ఎటువంటి నాటుపడవలు వెళ్లకుండా వారి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గోదావరి ఉధృతి తగ్గేంత వరకు గస్తీ ఉంటుందని స్థానిక ఎస్సై జానీ బాషా, రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు.



కోటిపల్లి మత్స్యకార కాలనీలో తగ్గుతున్న వరద ఉధృతి



ఇంకా వరద నీటితో నిండి ఉన్న పంటు ఎక్కే రహదారి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: సమాజాన్ని అన్ని విధాలుగా నాశనం చేస్తూ, ప్రజల ఆరోగ్య భద్రతకు ముప్పు కలిగిస్తున్న ప్లాస్టిక్ నిరోధానికి ప్రజలు, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, పరిసరాల పరిశుభ్రత ద్వారానే మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వంతో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి నడుచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు, సమాజాన్ని కూడా ఆరోగ్యవంతంగా చేసినట్లు అవుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగుతుందన్నారు. అనంతరం ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆటోమొబైల్ లాబొరేటరీ, ఎలక్ట్రానిక్స్ లాబొరేటరీలను ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ప్రారంభించారు. పచ్చదనం పరిశుభ్రత కోసం హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి సీనియర్ నేత వాసంశెట్టి సత్యం హైస్కూల్ హెచ్ఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణమూర్తి, వుండవిల్లి శివ, కడియాల రాఘవన్, గరికపాటి సూర్యనారాయణ, కవల నానాజీ, కంచుమర్తి బాబురావు, డి.గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుల తయారీ పోటీ

రామచంద్రపురం రూరల్: ప్రకృతికి మేలు చేకూర్చాలన్న ఆలోచనతో ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం గ్రామానికి చెందిన లవ్ టు సర్వ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల తయారీ పోటీ నిర్వహించారు. ఈ పోటీలలో 50 మంది విద్యార్థులు పాల్గొని వివిధ రకాల ఆకృతులతో మట్టి వినాయకులను తయారు చేసి ఔరా అనిపించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలోని అన్న క్యాంటీన్ నిర్వహణను శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పరిశీలించారు. క్యాంటీన్ నిర్వహణ, భోజనం, నాణ్యత, వడ్డన, సమయ పాలన తదితర అంశాలను పరిశీలించారు. నిర్వాహకులు, మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు.

మౌలిక వసతులు లేక ఇబ్బందులు



చెల్లూరులో సమస్యలు పరిష్కరించాలని సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

రాయవరం: గ్రామంలో కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని చెల్లూరు శివారు చింతలతోట వాసులు పంచాయతీలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన వి.రామబ్రహ్మం, చొల్లంగి రత్నకుమారి, బత్తుల దుర్గాదేవి తదితరులు పంచాయతీ కార్యాలయానికి వచ్చి వారి బాధలను విన్నవించారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నామని మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రహదారులు, డ్రెయిన్లు, విద్యుత్ సదుపాయం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఏకరువు పెట్టారు. మురుగునీరు పారక దోమలు వృద్ధి చెందడంతో అనారోగ్యం పాలవుతున్నామని, రాత్రి సమయాల్లో విషసర్పాలు, విష కీటకాలతో సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.ధనలక్ష్మికి వారు వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదు అందజేసిన వారిలో అధిక సంఖ్యలో మహిళలు ఉన్నారు.

జెడ్పీ చైర్మన్ పరామర్శ



వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి తదితరులు

రామచంద్రపురం రూరల్: ఇటీవల మృతి చెందిన రామచంద్రపురం జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శనివారం పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వరరావు భార్య విజయ, కుమారుడు సాయిరామ్‌లను పరామర్శించారు. జెడ్పీటీసీ మృతి తీరని లోటన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ అంబటి భవాని, కె.గంగవరం జెడ్పీటీసీ ఓబిలినేని వరలక్ష్మి, రాజ్‌కుమార్ దంపతులు, కాజులూరు జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు, రాయవరం జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, వెంకటరెడ్డి దంపతులు, వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారాం, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలు

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం, మాచర తదితర గ్రామాల్లో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర', 'స్వర్ణ ఆంధ్ర' నినాదంతో ర్యాలీలు నిర్వహించారు. మాచరలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు ర్యాలీలో పారిశుధ్య పరిరక్షణకు పాటుపడతామంటూ నినాదాలు చేశారు. ఎంఈఓ 2 ఖండవిల్లి విజయకుమార్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణాన్ని విఘాతం కలిగిస్తున్న అంశాలను వివరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కపిలేశ్వరపురంలో డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. పరిశుభ్రత ప్రాధాన్యతను తెలిజేసే కళా రూపాలను ప్రదర్శించారు. కార్యదర్శి శివ చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. సర్పంచ్ సాకా శ్రీనివాస్, అంగన్‌వాడీ, ఆశా, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు జీవీవీ సత్యనారాయణ, జీఎస్వీ ప్రసాద్, రాజశేఖరం తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (మండపేట): మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మండపేట పట్టణంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ టీవీ రంగారావు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరంలో శనివారం ఎంపీటీసీ రెడ్నం సతీష్ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

డీఎస్సీలో సత్తాచాటిన అభ్యర్థులు



9వ ర్యాంకు పొందిన పిల్లి నాగేశ్వరరావు



69వ ర్యాంకు సాధించిన పాలింగి అనూష

కపిలేశ్వరపురం: ఇటీవల విడుదలైన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో మాచర గ్రామ శివారు మాచర మట్టలు గ్రామానికి చెందిన పిల్లి నాగేశ్వరరావు డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ విభాగంలో జిల్లా స్థాయిలో 9వ ర్యాంకు సాధించారు. ఆయన తండ్రి సత్యనారాయణ, నాగమణి మాచరమట్టలు గ్రామంలో వ్యవసాయ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాగేశ్వరరావు మాచరమట్టలు, వేమగిరి, కపిలేశ్వరపురం ప్రభుత్వ పాఠశాలల్లో చదివారు. కపిలేశ్వరపురం మండలం వడ్లమూరుకు చెందిన పాలింగి అనూష 86.39 మార్కులు సాధించి, జిల్లాలో 69వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో 5వ ర్యాంకు సాధించింది. ఆమె తల్లిదండ్రులు పాలింగి శ్రీనివాస్, బేబీ సామాన్య కుటుంబానికి చెందిన వారు. వడ్లమూరు, కాలేరు ప్రభుత్వ పాఠశాల్లో ఆమె విద్యనభ్యసించింది.

శివఅమ్మిరాజుకు ఫిజిక్స్‌లో మూడో స్థానం

రామచంద్రపురం: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ మెరిట్ జాబితాలో రామచంద్రపురం మోడరన్ జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న చల్లా శివ అమ్మిరాజుకి మూడో స్థానం దక్కింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫిజికల్ సైన్స్ విభాగంలో అతడు మూడో స్థానం సాధించాడు.

వినాయకులు.. విభిన్న రూపాలు



ఛత్రపతి శివాజీ మహారాజ్ తోడుగా ఉత్సవానికి సిద్ధమైన విఘ్నపతి



సింహాసనంపై కూర్చున్న మూషిక వాహనుడు



సరస్వతి, లక్ష్మీదేవి తోడుగా ఏకదంతుడు

రాయవరం: గణనాథుని ఆగమనానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వాడవాడలా లంబోదరుణ్ని కొలువు తీర్చేందుకు భక్తులు, వినాయక ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఏకదంతుడ్ని ప్రతిష్ఠించేందుకు మండపాలను సిద్ధం చేస్తున్నారు. ఏడాదికాలంగా కళాకారులు కష్టపడి బొజ్జ గణపయ్యను విభిన్న రూపాల్లో తీర్చిదిద్దారు. వాడవాడలా కొలువుదీరేందుకు పలురూపాల్లో గణనాథుల విగ్రహాలు సిద్ధమయ్యాయి.